క్లుప్తంగా

సారాతో కుటుంబాలు ఛిద్రం



చిన్న కోరుమిల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీపీఈఓ ప్రసాద్

కపిలేశ్వరపురం: సారాని సేవించడం ద్వారా ఆరోగ్యం పాడై కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని, వ్యసనాలకు దూరం కాకపోతే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుందని డీపీఈఓ ఎస్‌కేడీవీ ప్రసాద్ హెచ్చరించారు. కోరుమిల్లి గ్రామ శివారు చిన్న కోరుమిల్లి గ్రామ సచివాలయంలో గురువారం నాటుసారాయితో తలెత్తుతున్న సామాజిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్, పోలీస్, పంచాయతీ అధికారులు అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఎస్. వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి కామేశ్వరరావు, ఎస్సై డి.రవికుమార్ పాల్గొన్నారు.

అపరాల సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: మండల గ్రామాలలో అపరాల సాగుకు రైతులు ప్రాధాన్యతనివ్వాలిలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ గతంలో డెల్టాలో రైతులు తొలకరి, దాళ్వా పంటల అనంతరం మూడో పంటగా పెసరా, మినుము వంటి అపరాలు, జనుము, పిల్లిపెసరా వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసేవారన్నారు. క్రమేపి పంటల సాగులో ఏర్పడ్డ కాలమార్పుడులు కారణంగా దాళ్వా సాగు ఆలస్యమై రైతులు అపరాల సాగు మానివేశారన్నారు. అయితే వరితో పాటు అదనపు ఆదాయాలను తెచ్చే అపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ వనం రమ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ. 2 లక్షల చెక్కు అందజేత



ఇన్సూరెన్సు చెక్కును సత్యనారాయణకు అందిస్తున్న బీఎం ఆనంద్ తదితరులు

రామచంద్రపురం: వెల్ల గ్రామానికి చెందిన జక్కుల వెంకట సత్యనారాయణకు పీఎంజేజేవై ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు మేనేజర్ చేతుల మీదుగా రూ.2లక్షల చెక్కును అందజేశారు. పట్టణంలోని కాకినాడ రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో చెక్కును అందించారు. సత్యనారాయణ భార్య వీరవెంకటలక్ష్మి మృతి చెందారు. ఈమె ఎస్‌బీఐలో పీఎంజేజేవై ఇన్సూరెన్సును గతంలో తీసుకున్నారు. ఇటీవల వీర వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందటంతో రూ. 2లక్షల ఇన్సూరెన్సు చెక్కును భర్త సత్యనారాయణకు అందించినట్లు బ్రాంచి మేనేజర్ ఆనంద్ స్థానిక విలేకరులకు తెలిపారు.

నెలపర్తిపాడు ఉప సర్పంచ్‌గా మంగయ్య చౌదరి ఎన్నిక



మంగయ్య చౌదరికి ఎన్నికధ్రువీకరణపత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి ప్రసాదరెడ్డి

రామచంద్రపురం రూరల్: నెలపర్తిపాడు పంచాయతీకి ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం ప్రిసైడింగ్ అధికారి ఎస్ఎస్ఆర్ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. 2వ వార్డు సభ్యుడు గుణ్ణం మంగయ్య చౌదరిని ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో 10 మంది వార్డు సభ్యులకు గాను 9 మంది వార్డు సభ్యులు, గ్రామ సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి ఎన్నికకు హాజరయ్యారు.

నేడు మండల బడ్జెట్ సమావేశం

కపిలేశ్వరపురం: మండల బడ్జెట్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. ఉదయం 10.30కి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభం కానున్నట్టు ఆమె తెలిపారు.

హెల్మెట్‌తో ద్విచక్ర వాహనదారులకు రక్షణ

మండపేట: ప్రయాణ సమయాల్లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉంటేనే రక్షణ అని టౌన్ సీఐ దారం సురేష్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా గురువారం పట్టణంలో ఆయన హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. పెద్ద కాలువ వంతెన వద్ద ఆయన టౌన్ ఎస్ఐ జీ చంటి, ఏఎస్ఐ చిన్నారావులను వెంటబెట్టుకుని వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే వాహనాలు తనిఖీలు చేశారు. రికార్డులకు లేని వారికి జరిమానా విధించకుండా వారి చేత హెల్మెట్ కొనిచ్చారు. ప్రాణరక్షణకు విధిగా హెల్మెట్ ధరించడం మంచిదని ఈ సారి హెల్మెట్ లేకుండా కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దొంగలుంటారు జాగ్రత్త!

- వేసవి కాలంలో ఎక్కువగా దొంగతనాలు
- కష్టార్జితాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రజలదే
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



అముజూరులో దొంగతనం జరిగిన ఇంట్లో చిందరవందరగా పారవేసిన సామాన్లు(ఫైల్)

కె.గంగవరం: వేసవి కాలమంటే ఉక్కపోతే ఒక్కటే కాదు దొంగతనాలు కూడా ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ కాలంలో వేసవి సెలవులు, విహారయాత్రలకు వెళ్లేవాళ్లు అధికంగా ఉంటారు. ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో దొంగతాలు జరుగుతుంటాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు రోజంతా కష్టపడి అర్ధరాత్రి ఎప్పటికో కంటి నిండా నిద్రిస్తారు. ఆ సమయమే దొంగలు చడి చప్పుడు లేకుండా చక్కగా బీరువాలు తెరిచి సొత్తుతో పారిపోతారు. ప్రజలు నష్టపోతున్నారు. దీనిపై పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తుంటారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రలు చెబుతుంటారు.

పెరుగుతున్న దొంగతనాలు

నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం పట్టణం, రూరల్ మండలాల్లో ఏటా వేసవిలో దొంగతాలు అడపడపా జరుగుతూనే ఉన్నాయి. ఇవి కాస్తా ఇప్పుడు పెరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. కె.గంగవరం మండలంలోని ఏడాది పట్టపగలే మహిళ మెడలో నుంచి బంగారు తాడు లాక్కెళ్లడం నుంచి పట్టపగలే ఇంట్లో సొమ్ము ఎత్తుకుపోయే వరకు రకరకాలుగా అపహరిస్తున్నారు. దీనికి జల్సాలు, అందివచ్చిన ఆధునిక విలాసాలు, మద్యం సేవించడమే కారణాలు. ఆందోళనకరమైన అంశం ఏమిటంటే టీనేజీ పిల్లలు ఎక్కువగా దొంగతానాలకు పాల్పడుతున్నారు.

రెక్కీ నిర్వహించి మరీ చోరీ

దొంగతం చేయాల్సిన ప్రదేశాలను రెండు, మూడు సార్లు పరిశీలిస్తారు. అంటే బిచ్చగాళ్లగానో లేక చెత్త కాగితాలు ఏరుకునే వాళ్లలాగానో వచ్చి ప్రణాళిక వేసుకుని సులువుగా దొంగతనం చేసి తప్పించుకుంటారు. కొందరు బంగారు, వెండి మెరుగుపెడతామని చెప్పి కళ్లముందే కనికట్టు చేసి దోచుకుపోతారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ చేస్తుంటారు. వెండీ బంగారమే కాదు వాళ్ల ఏది కనిపిస్తే అన్నీ దొచుకుపోతారు. ధ్యానం, విద్యుత్ మోటార్లు, వ్యవసాయ పనిముట్లు కూడా దొంగలించుకుపోయిన సంఘటనలో ఎన్నో ఉన్నాయి.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

వేసలి కాలం కావడంతో ఉక్కపోతతో మేడపైన పడుకోవడం, లేక ఇంటి బయట ఆవరణలో పడుకోవడం చేస్తుంటారు. ఇంటి తలుపులు తెరచి నిద్రపోతుంటారు. అయితే ఇలాంటి సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు తిరుగుతుంటే గమనించాలి. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ఆరుబయట పడుకుంటే ఇంటికి తాళాలు వేసి వాటిని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తే పోలీసులకు తప్పకుండా సమాచారం అందించాలి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం వేసవి కాలం సమీపించిన కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బయట ఊర్లకు వెళితే పోలీసులకు సమాచారం అందించాలి. ఇంటి పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన పోలీసులకు చెప్పాలి. రాత్రిళ్ల పలు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి సమయంలో గస్తీ కూడా తిరుగుతున్నాం. ఎటువంటి అనుమానం వచ్చినా వెంటనే సమాచారం అందించాలి.

– జానీ భాషా, ఎస్సై.. కె.గంగవరం

లాలీపప్ బోర్డుల పై రచ్చ

- ఆ సొమ్మంతా ఎవరి జేబులోకి వెళ్లింది ?
- కూటమి మద్యం పాలసీతో ప్రజలకు లేనిపోని చిక్కులు
- మున్సిపల్ నిధులు మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు
- అధికారులను నిలదీసిన ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం పలు అంశాలపై వాడివేడీగా జరిగింది. స్థానిక సమావేశపు హాలులో చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. సభకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరై పట్టణంలోని పలు సమస్యలపై మూకుమ్మడిగా కలిసి అధికారులను గట్టిగా నిలదీశారు. దీంతో ఒకానొక సమయంలో అధికారులకు సమాధానం చెప్పలేక నీళ్ల నమలాల్సిన పరిస్థితి ఎదురైంది.

సభలో పట్టణంలో డివైడర్లపై ఏర్పాటు చేసిన లాలీపప్ బోర్డుల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొనగా, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కూడా ఇదే అంశంపై అధికారులను గట్టిగా నిలదీశారు. దానికోసం చెప్పాలంటే కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు)కు బాగా తెలుసని ఎమ్మెల్యే ఆయనను వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో తీసుకొచ్చిన మద్యం పాలసీ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారంటూ 29వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కౌన్సిల్లో ధ్వజమెత్తారు. ఎన్నడూలేని విధంగా మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోయిందంటూ విమర్శలు వినిపిస్తున్నాయని తెలిపారు. అలాగే పట్టణంలో నిధులు ఎందుకు ఎక్కువగా ఖర్చవుతోందన మ్మెల్యే వేగుళ్ల కమిషనర్ రంగారావును నిలదీశారు. దీంతో కమిషనర్ నోటివెంట మాట మూగబోయింది.

పట్టణంలో ఎంతో కాలంగా లలీపప్ బోర్డులు డివైడర్లపై ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటి ద్వారా ఏమైనా ఆదాయం వస్తుందా అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారులను ప్రశ్నించారు. దానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కల్పించుకుని తాను కూడా ఇదే అంశాన్ని పలుమార్లు అడిగినా చెప్పలేదంటూనే, బోర్డుల కోసం రాజబాబు బాగా వివరిస్తారని ఆ అంశాన్ని ఆయన బదిలీ చేశారు. రాజబాబు మాట్లాడుతూ గత టీడీపీ పాలకవర్గంలో ఈ బోర్డుల ఏర్పాటు ఇంతకాలం లీజుకు ఇచ్చారని, ఏడాదికి రూ 18 లక్షల వరకూ ఆదాయం వచ్చేదని కౌన్సిల్‌కు తెలియపరిచారు. కానీ ఆ సొమ్ములకు ప్రభుత్వ లెక్కలు లేకపోవడం బాధాకరమన్నారు. దాదాపు 2016 నుంచి దీని కోసం పోరాడుతున్నానని ఆ సొమ్ములన్నీ ఎవరి జేబులోకి వెళ్లాయో ఇప్పటికీ తెలియదన్నారు. వెంటనే బోర్డులు తీయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తోట అధికారులకు చెప్పారు.

కొత్త ప్రభుత్వంలో వైన్‌షాపులు పట్టుకొచ్చి నివాస ప్రాంతాల మధ్య పెట్టడంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇలా ఎంతో మంది బాటసారులు, వాహనదారులు నానా రకాల ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ లేవనెత్తారు. రాజరత్న దగ్గర, మున్సిపల్ కార్యాలయం వెనక, కొత్తగా పెట్టబోయే బ్రాందిషాపు వల్ల ఇలా అన్ని చోట్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. రాజబాబు లేచి మాట్లాడుతూ బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కు వద్ద బ్రాందిషాపు వద్ద కోలాహలంగా ఉంటోందన్నారు. ఎవరని ఏమనలేని పరిస్థితి ఉందని తాగేసి రోడ్లకు అడ్డంగాను, పార్కుల్లోను పడుకుంటూ ప్రజలకు ఆగ్రహం రప్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం పక్కన అయితే రోడ్డు బ్లాక్ చేసి వ్యాపారాలు సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మూడు షాపులు కూడా మార్చడానికి వచ్చే కౌన్సిల్‌కు తీర్మానం అజెండా తీసుకురావాలని అన్నారు. తీర్మాణం తర్వాత సంబంధించిన ఉన్నతాధికారులకు లేఖలు పంపుదామన్నారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడారు.



చైర్‌పర్సన్ దుర్గారాణి

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నిక



రాయవరంలో ఉప సర్పంచ్ కొల్లి వెంకటరమణమ్మ, రాంబాబు దంపతులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ నాయకులు

రాయవరం: మండలంలోని రాయవరం, వెదురుపాక ఉప సర్పంచ్ పదవులకు గురువారం జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాయవరం ఉప సర్పంచ్ పదవికి బొడ్డు శ్రీను, వెదురుపాక ఉప సర్పంచ్ పదవికి దంతుర్తి సుబ్రహ్మణ్యంలు రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాయవరం ఉప సర్పంచ్ పదవికి పోటీ నెలకొంది. వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బలపర్చిన కొల్లి వెంకటరమణమ్మ ఉప సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసింది. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు వుండవిల్లి రాంబాబు ఉప సర్పంచ్ పదవికి పోటీలో ఉండగా, వెంకటరమణమ్మకు తొమ్మిది మంది, రాంబాబుకు ఐదుగురు వార్డు సభ్యులు చేతులెత్తగా వెంకటరమణమ్మ ఉప సర్పంచ్‌గా ఎన్నికై నట్టు ఎన్నికల అధికారి పుప్పాల శ్రీనివాస్ ప్రకటించారు. వెదురుపాక ఉప సర్పంచ్ పదవికి కంచి రత్నకుమారి ఉప సర్పంచ్ పదవికి పోటీలో నిలిచారు. 14 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా రత్నకుమారికి ఆమోదం తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి అనిల్‌కుమార్ ప్రకటించారు. రెండు చోట్ల వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఎన్నిక కావడంతో వైఎస్సార్ సీపీ వర్గాల్లో ఆనందోత్సవాలు మిన్నంటాయి.ఉప సర్పంచ్‌లుగా ఎన్నికైన కొల్లి వెంకటరమణ, కంచి రత్నకుమారిలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, పారిశ్రామికవేత్త తేతల సుబ్బరామారెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పార్టీ నేతలు కొల్లి రాంబాబు, వెలగల సత్యనారాయణరెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి, పడాల కమలారెడ్డి, సర్పంచ్ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై తల్లిదండ్రులతో అధికారుల సమీక్ష



సమావేశంలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

కాజులూరు: మండల గ్రామాలలోని పలు ప్రభుత్వ పాఠశాలల విలీనంపై మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం విద్యార్థుల తల్లితండ్రులతో అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి డేవిడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ జె.రాంబాబు, డీవైఈఓ వెంకటేశ్వ్రరావు తదితరులు మాట్లాడుతూ మండలంలో 13 మండల పరిషత్ పాఠశాలలు విలీనం కానున్నాయన్నారు. దీనిపై పలువురు తల్లితండ్రులు మాట్లాడుతూ విలీనం వలన తమ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. దూరభారంతో పాఠశాలలకు డుమ్మాకొట్టే అవకాశం ఉందన్నారు. పలు చోట్ల రహదారి సదుపాయం సక్రమంగా లేకపోవడం, గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉండడం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీనిపై ఎంపీడీఓ జె.రాంబాబు, డీవైఈఓ వెంకటేశ్వ్రరావు తదితరులు మాట్లాడుతూ పాఠశాలల విలీనం వలన విద్యాప్రమాణాల మెరుగుదలకు దోహద పడుతుందన్నారు. నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విద్యార్థికి ప్రతి సబ్జెక్ట్‌పై పూర్తి స్థాయిలో అవగాహణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కాజులూరు, పెనుమళ్ళ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంలు పంపన కృష్ణమూర్తి, శ్రీనివాస్, 13 విలీనం పాఠశాలల హెచ్‌ఎంలు పెరెన్స్‌కమిటీ చైర్మెన్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్

కె.గంగవరం: తామరపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి గురువారం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, జిల్లా యువజన అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.10 లక్షల గ్రాంట్‌ను అందించారు. ఈ నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఎంపీ బోస్ నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామంలో ఎంపీ గ్రాంట్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేకపోవడం గుర్తించి వెంటనే నిధులు కేటాయించిన బోస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ పార్టీ కన్వీనర్ పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ తోకల మంగశ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ పండు గోవిందరాజు, పార్టీ నాయకులు మేడిశెట్టి గోవిందరాజు, జంగం సత్తిబాబు, వెంటపల్లి నాని, దేవపాటి రాంబాబు, మేడిశెట్టి దుర్గారావు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కపిలేశ్వరపురం: వరి పంటను దెబ్బతీసే తెగుళ్ళపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ హెచ్చరించారు. నల్లూరులోని వ్యవసాయ క్షేత్రంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ పంట రక్షణకు పాము పొడ తెగులు ప్రమాదకరంగా మారిందన్నారు. నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం వేసవి ఆపరాల పంట సాగు ప్రయోజనాలను రైతులకు అవగాహన నిర్వహించారు. పొలంబడి సంధానకర్త పిల్లి గోవిందుకు నూరుశాతం రాయితీపై సూడోమోనస్ తెగులు మందు, పొటాస్ రిలీజింగ్ బ్యాక్టీరియా ప్యాక్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గుత్తుల విష్ణు, పంపన సత్యనారాయణ, పెంకే రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు యామిని దేవి, రైతులు పాల్గొన్నారు.

టిడ్కోలో తాగునీటి కుళాయిల ఏర్పాటు


- పైలట్ ప్రాజెక్టుగా రూ.4.15 లక్షల కేటాయింపు
- కౌన్సిల్లో నిధులు మంజూరు చేశామన్న చైర్‌పర్సన్ దుర్గారాణి



టిడ్కో వాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఈ వేసవిని దృష్టిలో ఉంచుకుని 20వ వార్డు పరిధి గొల్లపుంత రోడ్డులోని టిడ్కో వాసులకు తాగునీటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. గురువారం కౌన్సిల్ సమావేశం అనంతరం మున్సిపల్ అధికారులను వెంట బెట్టుకుని ఆమె టిడ్కో గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో కాసేపు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ కాలనీకి తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతీ బ్లాకుకు తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. శానిటేషన్ అధికారులు పారిశుద్య సిబ్బందితో చేపట్టిన తుప్పలు తొలగింపు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. చైర్‌పర్సన్ వెంట టిడ్కో ఏఈ వివేక్, సీఎల్‌టీసీ బిందు, ఏఈ బీ ఆంజనేయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు వున్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన



తోటపేటలో అవగాహన శిబిరాలను ప్రారంభిస్తున్న వైద్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట శివారు గాంధీనగర్‌లోను, రామచంద్రపురం పట్టణంలోను గురువారం ఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం వలన చిన్న పిల్లల్లో కలిగే అనారోగ్యాలు, పోషణాల యాజమాన్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ప్రవీణ్, ఆర్ఎంఓ డాక్టర్ చక్రధర్, డీజీఓ డాక్టర్ సత్యవేణి పాల్గొని పోషణ మేళాకు సంబంధించి స్టాల్స్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎదిగే పిల్లలు, గర్భిణులు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏ పోషకాల లోపంతో ఎటువంటి ఇబ్బందులు వస్తాయి వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలి తదితర అంశాలు ప్రజల్లో అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటలు ఆడించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ టీముకు స్టీల్ బాక్సుల బహూకరణ



స్టీల్ బాక్సులు బహుకరించిన దృశ్యం

కె.గంగవరం: గ్రామానికి చెందిన అమ్మ టీముకు ఎంపీటీసీ పెద్దరెడ్డి యేసు, నాగవెంకట తులసీ, చవ్వాకుల ప్రసాద్, మాధురి కుటుంబ సభ్యులు ఫుడ్ స్టీల్‌బాక్సులు బహూకరించారు. గ్రామానికి చెందిన అమ్మ టీం గత మూడు సంవత్సరాలుగా కె.గంగవరం మండలంలో ఏ ఫంక్షన్లోనైనా ఆహారం మిగిలిపోతే వాటిని పాడేయకుండా ఆహారం అవసరం అయిన వారికి అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ యేసు కుమారుడు చరణ్‌ఆదినరేష్ జన్మదినం సందర్భంగా గ్రామంలోని భవితా కేంద్రంలోని చిన్నారులకు విందు భోజనం ఏర్పాటు చేసి అనంతరం సుమారు రూ.25 వేలు విలువ చేసే స్టీల్ బాక్సులను అమ్మ టీం సభ్యులు చేస్తున్న సర్వీసును గుర్తించి బహూకరించారు. ఈ కార్యక్రమంలో సలాది ప్రసన్నకుమార్, ఎస్ బాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ వేడుకలో విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శ్రీ చైతన్య స్కూల్‌లో ప్రిన్సిపాల్ జి.లీలా వంశీకృష్ణ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యూకేజీ నుంచి ఒకటో తరగతిలోనికి, 5వ తరగతి నుంచి ఆరో తరగతికి వెళ్లే విద్యార్థులకు ప్రతి ఏడాది గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామన్నారు. పై తరగతులపై విద్యార్థులకు అవగాహన కలగడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల మండపేట రీజినల్ ఇన్‌చార్జి ఎం.లక్ష్మీనరేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్ గ్రామ సభలు

రాయవరం: మండలంలోని వెదురుపాక, నదురుబాద, సోమేశ్వరం గ్రామాల్లో గురువారం ఆక్వా జోనేషన్ గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభల్లో భాగంగా వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించి, వాటిని ఆక్వా చెరువులుగా మార్చుకునే అవకాశంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వి.రమణారావు, డ్రైనేజీ ఏఈ సాయిచంద్రిక, ఆర్ఐ ధర్మేంద్ర తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సోమేశ్వరం, వెదురుపాక, నదురుబాద సర్పంచ్‌లు ఆరిఫ్, మల్లిడి సూరారెడ్డి, చింతపల్లి శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు

మండపేట: పవిత్ర రంజాన్ మాసంలో మొదలయ్యే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం కలువపువ్వు సెంటర్లోని పెద్ద మసీదు (జామియా మసీదు) ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మసీదు కమిటీ సభ్యులు ఎండీ అతావుర్ రెహ్మాన్, ఎండీ కరీముల్లాషా ఖాదరీ ఆయనను మసీదు మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఉపవాస దీక్ష విరమణ పూజల్లో పాల్గొని ముస్లింలతో కలిసి విందు స్వీకరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పాలచర్ల శిరీష్, శెట్టి రవికుమార్, ఎండీ గయాసుద్దీన్, హర్షి, గాంధీ తదితరులు వున్నారు.

కోర్టు వాయిదాలకు వెళ్లని ఇద్దరికి 14 రోజుల రిమాండ్

మండపేట: ఓ కేసులో నిందితులుగా అరెస్టయిన అర్తమూరు, మోదుకూరు గ్రామాలకు చెందిన యార్ల శివసత్యనారాయణ, బుంగ విజయ్‌బాబులు కోర్టు వాయిదాలకు తప్పించుకు తిరుగుతున్నారని సీఐ దారం సురేష్ తెలిపారు. వీరిపై ఆలమూరు న్యాయమూర్తి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ ఇచ్చారని తెలిపారు. ఇద్దరినీ పట్టుకుని గురువారం కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. నిందితులను రామచంద్రపురం సబ్‌జైలుకు తరలించామని సీఐ సురేష్ చెప్పారు. కోర్టుకు కానిస్టేబుల్ ఈశ్వర్ హాజరుపరిచారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ

కపిలేశ్వరపురం: వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 25న అంగన్‌వాడీలకు పోషణ పదాయిబీ కార్యక్రమంపై అవగాహన తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి అధికారి గజలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా చిన్నారుల విద్య, ఆరోగ్యం అంశాలపై పురిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జీరో నుంచి 6 సంవత్సరాల పిల్లలకు వారి మానసిక స్థితిగతులు ఆధారంగా అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల సంరక్షణపై తల్లిదండ్రులతో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.